క్లుప్తంగా

విద్యుత్‌శాఖ నూతన డీఈగా భాస్కరరావు



చెరుకుపల్లి: విద్యుత్‌శాఖ బాపట్ల డివిజినల్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్‌గా జి.భాస్కరరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో భాస్కరావు గుంటూరులో విధులు నిర్వహించి పదోన్నతి పై చెరుకుపల్లి వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన భాస్కరరావును చెరుకుపల్లి విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ పెరుగు శ్రీనివాసరావు, సబ్ ఇంజినీర్ అడుసుమల్లి దీప్తి, మండల విద్యుత్ శాఖ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

కషాయంతో తెగుళ్ల నివారణ

కర్లపాలెం: చిల్లీస్ స్పెషల్ కషాయంతో తెగుళ్లను నివారించుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయం బాపట్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్ తెలిపారు. శనివారం బుద్ధాం, దమ్మనవారిపాలెం గ్రామాలలోని ప్రకృతి వ్యవసాయం రైతులకు చిల్లీస్ స్పెషల్ కషాయం పపై అవగాహన కల్పించి తయారీ విధానంను వారికి వివరించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పది లీటర్ల గోమూత్రంలో రెండున్నర కిలోల వేపాకు ముద్ద, రెండున్నర కిలోల ఉల్లి పేస్ట్, 50గ్రాముల ఇంగువ, పసుపు పావుకేజీ, సీతాఫలం ఆకుల ముద్ద అరకేజీ. ఆముదం ఆకులు, జిలల్లేడు ఆకులు అరకేజీ చొప్పున కలిపి స్టవ్‌పై మరిగించి కషాయం తయారు చేసుకోవాలని చెప్పారు. ఈ కషాయాన్ని మిర్చితోట పూత దశలో ఉన్నప్పుడు పిచికారీ చేయటం వలన పురుగు నశించి పూతరాలటం ఆగిపోతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ, శ్యామ్యేలు, తదితరులు ఉన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని సీపీఓ కార్యాలయం అసిస్టెంట్ డైరక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం పెదగొల్లపాలెం గ్రామంలో సచివాలయం సిబ్బంది చేస్తున్న పీ4 సర్వే కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 30 కేసులు పరిష్కారం

వేమూరు: లోక్ అదాలత్ ద్వారా 30 ఎక్సైజ్ కేసులు పరిష్కారం అయ్యాయని ఎక్సైజ్ సీఐ ఎ.రవి కుమార్ తెలిపారు. తెనాలి కోర్టులో శనివారం జరిగిన లోక అదాలత్‌లో వేమూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 మే 2020 నుంచి 15 అక్టోబరు 2024 వరకు నమోదు చేసిన కేసుల్లో 30 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కేసులు ఉన్న వ్యక్తుల నుంచి రూ. 1,77,300 కాంపౌండింగు ఫీజు వసూలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

'బేతేలు' వ్యవస్థాపకులు ప్రకాశం మృతి

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని బేతేలు ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు కొనకాల ప్రకాశం (94) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన భూస్థాపన కార్యక్రమం ఆదివారం జరుగుతుందని చర్చి నిర్వాహకులు కొనకాల అబ్రహం తెలిపారు. ప్రకాశం ఆరు దశాబ్దాలుగా ప్రభువు సేవలో కొనసాగారని తెలిపారు.

పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలి

కొల్లిపర: రైతులు పండిస్తున్న వివిధ పంటలకు మద్దతు ధర చట్టం అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అన్నవరపు లంక గ్రామాలలో సోమవారం గుంటూరులోనే వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలంటూ రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల కిందట క్వింటాల్ పసుపు ధర 16,000 కాగా ప్రస్తుతం రూ.9500కి పడిపోయిందని, రూ.32,000 అమ్మిన మిర్చి పది పదకొండు వేలుకి పడిపోయిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. 14 నెలల కిందట శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో పసుపు కాలిపోయి, వంద కోట్ల రూపాయలు రైతుల నష్టపోయిన ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో క్వింటాల్ పరిస్థితి 7000 రూపాయలు ఇస్తామన్న వాగ్దానం 8 నెలలు గడిచినా అమలు కాలేదు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లంకిరెడ్డి నాగేశ్వర్‌రడ్డి, అచ్యుత, సురేష్, కేసరి మాధవరెడ్డి, రంగా కురవారెడ్డి, బొట్టు కోటిరెడ్డి, చంటి, అవుతూ రత్తారెడ్డి పాల్గొన్నారు .

నిర్లక్ష్యం నీడలో 'అంగన్‌వాడీలు'

- పనిదినాల్లో కేంద్రాలకు తాళాలు
- నిర్వహణలో సమయపాలన కరవు
- నమోదవని చిన్నారుల రోజువారీ హాజరు
- తేటతెల్లమవుతున్న పర్యవేక్షణా లోపం



అనంతవరం ఎస్సీ కాలనీలో శనివారం ఉదయం మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



అనంతవరం సచివాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రం

కొల్లూరు: చిన్నారులకు సృజనాత్మకమైన విద్యను అందిస్తూ, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యపు కేంద్రాలుగా మారిపోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు రెండో శనివారం ఎటువంటి సెలవును ప్రభుత్వం కేటాయించలేదు. రోజువారీ పనిదినాలు మాదిరిగానే రెండో శనివారం సైతం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయడంతోపాటు, వారికి ఆటపాటలతో కూడిన విద్యను అందించాల్సి ఉంది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పనిదినమైన రెండో శనివారాన్ని అనధికారికంగా రెండో శనివారాన్ని సెలవుగా ప్రకటించుకొని విధులకు డుమ్మా కొట్టి అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సగానికి పైగానే మూత..

అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొల్లూరు మండలంలో ఉన్న కొల్లూరు, దోనేపూడి, అనంతవరం సెక్టార్ల పరిధిలో శనివారం సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు తెరచుకోకపోవడం ప్రజల్లో చర్చకు దారితీసింది. కేంద్రాల పనితీరును పరిశీలించాల్సిన ఐసీడీఎస్ యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు రోజురోజుకు కుంటుపడుతుంది.

మధ్యాహ్నానికే బంద్..!

కేంద్రాల నిర్వహణలో సమయపాలన సైతం పాటించకపోవడం ప్రధాన లోపంగా కానవస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8.40 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరచి ఉంచి చిన్నారులను కేంద్రాలకు తీసుకువచ్చి వారికి సమయానికి పౌష్టికాహారం అందించాల్సి ఉన్నా ఆచరణలో సమయపాలన కొరవడిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం 10 తరువాత తెరుచుకుంటున్న కేంద్రాలు మధ్యాహ్నానికే మూతపడుతుండటం గమనార్హం. గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు, మండల కేంద్రం, సెక్టార్ హెడ్ క్వార్టర్లలోని కేంద్రాలతో సహా పనిదినాలలో మూతపడి ఉండటం ఐసీడీఎస్ యంత్రాంగం పనితీరుకు అద్దంపడుతుంది. మిగిలిన రోజుల్లోను చిన్నారుల హాజరు రోజువారీ నమోదు చేయకుండా రెండు, మూడు రోజులకోమారు నమోదు చేస్తూ కేంద్రాలకు రాని చిన్నారులను కూడా హాజరైనట్లు చూపిస్తూ లబ్ధిపొందుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి ప్రజాచైతన్య యాత్రలు



21వవార్డులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: ప్రజల సమస్యలను తెలుసుకుని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ పేర్కొన్నారు. పట్టణంలోని 21వవార్డులో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. వార్డులో అనేక రకాల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇళ్ల స్థలాలు లేని అనేకమందికి ప్రభుత్వం ఇస్తామన్న 2 సెంట్ల స్థలం ఇవ్వాలని, రేషన్ షాపు ద్వారా కంది పప్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.రమేష్, జి.దానియేలు, డి.శ్రీనివాసరావు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరుని గ్రామోత్సవం



రేపల్లె రూరల్: పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్ సెంటరులోని శ్రీసిద్ధి విఘ్నేశ్వర స్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠ, ఉక్తహోమం, జలాధివాసం, అధివాస హోమం, నీరాజనము తదితర పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న సిద్ధి వినాయకస్వామి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని, నవగ్రహములు, శిఖరములను ప్రత్యేక వాహనాలలో నెలకొల్పి పురవీధుల్లో ఊరేగింపు చేసి ఆలయ ఆవరణంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

లక్ష్యసాధనలో మహిళలు ముందంజ

- వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



డాక్టర్ ఈవూరి కేశవతిని సత్కరిస్తున్న మహిళలు



కూచిపూడిలో మహిళను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు



వేమూరులో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ



అవయవదానానికి ముందుకువచ్చిన మహిళలను సన్మానిస్తున్న నిర్వాహకులు

చెరుకుపల్లి: మహిళలు తమ లక్ష్యాలు సాధించేందుకు ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగినప్పుడే వారికి విజయాలు సొంతమవుతాయని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్లపల్లిలోని డాక్టర్ ఈవూరి గణేష్ క్యాంపు కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం డాక్టర్ ఈవూరు గణేష్, డాక్టర్ కేశవతిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు తిరుగుతారని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించుకోవాలని గణేష్ అన్నారు, భూమిపై స్త్రీ లేకపోతే జననం లేదని, గమనం లేదన్నారు. మహిళలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాడులు, హత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీనిపై పెద్ద స్థాయిలో ఉద్యమించాలన్నారు. అనంతరం డాక్టర్ ఈవూరి కేశవతి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారని, మహిళల రక్షణ కోసం దిశా యాప్ సృష్టించి, వారికోసం ప్రత్యేకంగా దిశా పోలీస్‌స్టేషన్‌లనే ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా వారు ఆర్థికంగా ఎదగాలనే గొప్ప మనసుతో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుమీదే అందించారని గుర్తు చేశారు. అదేవిధంగా రాజకీయాల్లో, కాంట్రాక్ట్ వర్కులలో కూడా మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం తీసుకొచ్చిన మహిళా పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అనంతరం పార్టీ క్యాంపు కార్యాలయంలోనే డాక్టర్ కేశవతిని నియోజకవర్గంలోని పలువురు మహిళలు పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. వైఎస్సార్ సీపీ చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె, రేపల్లె రూరల్ కన్వీనర్లు దుండి వెంకటరామిరెడ్డి, ఐ.రామకృష్ణ, రాంబాబు, శేషగిరిరావు, అనీల్, రేపల్లె నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మీ, మహిళా సీనియర్ నాయకులు సిహెచ్ నాగలక్ష్మీకుమారి, సజ్జా పద్మావతి, ఉమారాణి, సుజాత, అమూల్య, అనంతలక్ష్మీ, అలివేలు మంగమ్మ, తదితర మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను అందరూ గౌరవించాలి..

అమర్తలూరు(వేమూరు): మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ప్రభుత్వాలను అధికారం నుంచి దించేంది మహిళలే.. అధికారం ఇచ్చేది మహిళలేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషాంబ, గ్రామ సర్పంచ్ కొండముది శ్యామల, వివిధ పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వాసవి క్లబ్, గీతా మందిరం ఆధ్వర్యంలో...

వెల్లటూరు(భట్టిప్రోలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతా మందిరంలో వేడుకలు నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, గీతా మందిర నిర్వాహకులు వేములపల్లి వనజాక్షి, హరి శ్రీనివాస భజన బృందాలు, ముంకుంద కోలాట బృందం అధ్యక్షులు నంబూరు పద్మజ, పెద్దింటి ఉదయశ్రీ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజేటి పద్మావతి, సగ్గుల వసుంధరలను సన్మానించారు. తోపుడు బండ్లు వ్యాపారం చేసుకుంటున్న సుగాలి మహిళలకు గొడుగులు అందచేశారు.

మహిళ దినోత్సవం ర్యాలీ..

వేమూరు: మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్ఐ రవి కృష్ణ తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వేమూరులో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. రైటర్ ప్రసాద్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో...

చుండూరు(వేమూరు): మహిళలు అన్నిరంగాల్లో ముందుంటున్నారని చుండూరు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. చుండూరులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు త్యాగమూర్తులు

బాపట్ల: మహిళల త్యాగాలు నిరుపమానమైనవని, అవయవ దానం కోసం మహిళలు ముందుకు రావడం శ్లాఘనీయం అని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ చెప్పారు. శనివారం రామకృష్ణాపురంలోని పీఎస్‌కే నర్సింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అవయవదానం కోసం ముందుకు వచ్చిన మహిళలు పీఎస్ కె విద్యాసంస్థల కార్యదర్శి పేర్లి సంపత్ కుమారి, మరుప్రోలువారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమిరిసెట్టి రమాదేవి లను ఆమె సత్కరించారు. సభకు బాపట్ల జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.సిద్ధార్థ అధ్యక్షత వహిస్తూ, అవయవ,శరీర దానం కోసం మరింతమంది మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, పీఎస్‌కే విద్యాసంస్థల కరస్పాండెంట్ పేర్లి సునీల్ కుమార్, ఉపాధ్యాయ నాయకుడు గురజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే వైఎస్ జగన్ ధ్యేయం

- మహిళలను నిలువునా ముంచిన కూటమి సర్కార్
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా నాయకులు

బాపట్లటౌన్: మహిళాభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. తొలుత పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున సమక్షంలో మహిళలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అశ్వినిరెడ్డి మాట్లాడుతూ మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశయాలతో ప్రతి మహిళా తన పిల్లల్ని ఉన్నత చదువులు చదివించుకోవాలనే ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో మహిళల అభ్యున్నతి కోసం అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలతో పాటు ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు మహిళల ఖాతాల్లోనే జమచేశారన్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా దిశా చట్టాన్ని ప్రవేశపెట్టి మహిళలకు అండగా నిలిచిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు బూటకపు వాగ్దానాలతో మహిళలను మోసం చేశాడన్నారు. అనంతరం మహిళలను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షురాలు జపరున్నీసా, బాపట్ల నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు వేల్పుల మీరాబీ, పిట్టలవానిపాలెం మండల ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి సింధూ, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, జిల్లాలోని మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు పాల్గొన్నారు.

నేటి నుంచి తెనాలిలో అష్టోత్తర శతకోటి

- శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి
- తాలూకా హైస్కూల్ గ్రౌండ్ వేదిక



వివరాలు తెలియజేస్తున్న ఈఓ అవుతు శ్రీనివాసరావు, నిఖిల్ శాండిల్య

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఆదివారం నుంచి ఆరంభం కానుంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహక కమిటీ పూర్తి చేసింది. శనివారం అదే ప్రదేశంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. 2022 డిసెంబరు 25న అష్టోత్తర శతకోటి (108) శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల్లోని భక్తులు పాల్గొన్నారు. పారాయణ పూర్తయిన నేపథ్యంలో వైఖానసాగమోక్తంగా పూర్ణాహుతి మహాయజ్ఞం తలపెట్టారు. ఆదివారం నుంచి 14వ తేదీ వరకు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు విశేష హోమాలు, కల్యాణాలు, ఉచిత సామూహిక పూజలు, ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈఓ అవుతు శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్ తెలిపారు.

కార్యక్రమాలివిగో...

ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికల శోభాయాత్రతో వేడుకలు ఆరంభమవుతాయి. రాత్రి 7.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షాధారణ, అంకురారోపణ ఉంటాయి. 10వ తేదీ ఉదయం ఆరు గంటలకు గోపూజతో ఆరంభించి, శ్రీసీతారాములకు పంచామృత స్నపన, 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం జరుగుతుంది. 11.30కు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటాయి. సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుంది. 11న ఉదయం 10 గంటలకు శ్రీరుక్మిణీ కళ్యాణం, 11.30 గంటలకు డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్, మాచిరాజు కిరణ్‌కుమార్, సాయంత్రం 6.45 గంటలకు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారని తెలిపారు. 12న ఉదయం 9 గంటలకు శ్రీసీతారాముల కళ్యాణం, తదుపరి బ్రహ్మశ్రీ డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మతో ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు సాయివేద వాగ్దేవితో భక్తిగీతాలాపన ఉంటాయి. 13న ఉదయం 9 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, తదుపరి సుదర్శనం సీతారామాచార్యులతో ప్రవచనం, సాయంత్రం 6.45కు మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనం. 14వ తేదీ ఉదయం విశేష హోమం, పూర్ణాహుతి, 11.30కు శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం శ్రీ విద్యారణ్య భారతీస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం ఉచిత సామూహిక కుంకుమార్చన, 6.45కు డాక్టర్ గరికపాటి నరసింహారావుతో ప్రవచనం ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, కల్లూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రేపల్లె రూరల్: హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని పోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా హైందవ సంస్కృతి పరిరక్షణ, హిందూ ధర్మంలో స్త్రీల పాత్రపై నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సులో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ సంస్కృతి పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమన్నారు. ఆది పరాశక్తిగా, చదువుల తల్లిగా, సిరుల తల్లిగా మహిళలే ఆధిపత్యం వహించారని, అటువంటి స్త్రీలను ఎవరూ తక్కువగా చూడరాదని పేర్కొన్నారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు రేపల్లె సుబ్బారావు, కోయ బ్రహ్మేంద్ర, గరికపాటి రేణుకస్వామి, ఫౌండేషన్ కన్వీనర్లు కోటేశ్వరరావు, జంగం శ్యామ్‌ప్రసాద్, శొంఠి బాబూరావు, వీరరాగవయ్య, వీరబాబు, నాగరాజు పాల్గొన్నారు.

రంగవల్లులతో రైతులకు అవగాహన

తెనాలిటౌన్: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం కొలకలూరులో నివాసం ఉంటున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రైతులకు రంగవల్లులతో వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ కాలిశెట్టి ఫణీకుమార్, గ్రామ పెద్దల సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నూతక్కి అబ్రహాం సాహిత్యం చిరస్మరణీయం

తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహాం సాహిత్య చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అబ్రహాం జయంతిని కొలకలూరు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఆది జాంబవ దళిత ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో అబ్రహాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి మాట్లాడుతూ అబ్రహాం రచనలలో కరుణ, రసాత్మకత ఉట్టిపడుతుందని తెలిపారు. ఒక మహాకవికి ఉండాల్సిన లక్షణాలన్ని అబ్రహాంలో ఉన్నాయని అన్నారు. అబ్రహాం సాహితీ విలువలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నాకర్, ఉన్నం యేహేస్కేల్, పెద్దెటి యోహాన్, గ్రామ మాజీ సర్పంచి వల్లూరి వరప్రసాద్, రచయిత బీఆర్, రంగస్థల నటుడు శరత్ వెంకయ్య, కోడూరు సుదర్శన్, యడ్లపల్లి రవికిరణ్, సుద్దపల్లి మురళీధర్, కొలకలూరు పాపారావు, తోట నాగేశ్వరరావు, కొలకలూరు నాగేశ్వరరావు, పినపాటి అనిల్, చందు పాల్గొన్నారు.

జాతీయ యూనిఫెస్ట్‌లో నిహారికకు రజతం



పతకం, జ్ఞాపికతో నిహారిక

తెనాలి: న్యూఢిల్లీలోని అమిటి యూనివర్సిటీ నోయిడాలో జాతీయస్థాయిలో నిర్వహించిన 38వ యూనిఫెస్ట్‌లో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి పాల్గొన్న తెనాలికి చెందిన నలుకుర్తి నిహారికకు స్కిట్ విభాగంలో రజత పతకం సాధించింది. నిహారిక పద్మావతి విశ్వవిద్యాలయంలో బీటెక్(కంప్యూటర్ సైన్స్) ఫైనలియర్ చదువుతోంది. జాతీయ స్థాయి యూనిఫెస్ట్‌కు విశ్వవిద్యాలయం బృందంతో కలిసి పాల్గొంది. సాంస్కృతిక అంశాల్లో నిర్వహించిన పోటీల్లో నిహారిక బృందం ప్రదర్శించిన స్కిట్ ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం అందుకుంది.